



గజపతినగరం: భోజనాల కౌంటర్ వద్ద మహిళల తోపులాట

బెదిరించి.. పిలుచుకొచ్చి భోజనమూ పెట్టరా?

ఆసరా పేరుతో ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యుల సహనానికి పరీక్ష పెట్టింది. సమావేశానికి రాకుంటే పథకాలు నిలిపేస్తామని వలంటీర్లు, ఆర్పీలు బెదిరించడంతో అయిష్టతతో వెళ్లిన వారికి అక్కడ అవస్థలు ఎదురయ్యాయి. సమయం మించాక కాని భోజనం పెట్టలేదు. ఆలస్యంగానైనా అందరికీ ఆహారం అందలేదు. భోజనం కోసం నెట్టుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి కనిపించింది. ఈ పరిస్థితికి నొచ్చుకున్న కొందరు తిట్టుకుంటూ ఇంటిబాట పట్టారు. మరోవైపు ఎండ వేడికి ఆపసోపాలు పడ్డారు. గజపతినగరంలో వృద్ధులు సొమ్మసిల్లి పడిపోయారు. అన్నిచోట్లా ముఖ్య నేతలు మాట్లాడుతుండగనే వెనుతిరిగారు.

- ఆసరా సభకు వచ్చిన మహిళలకు అవస్థలు
- ఆహారం, నీరు అందివ్వడంతో అధికారుల వైఫల్యం
- తోపులాట.. సొమ్మసిల్లి పడిపోయిన వృద్ధులు
- భోజనం దొరక్క కొందరు వెనుదిరిగిన వైనం
- ముఖ్య నేతలు మాట్లాడుతుండగానే బయటకు..



ఎండ వేడికి సొమ్మసిల్లిన సీతమ్మ



ఎల్.కోటలో భోజనం కోసం ఎండలో మహిళల ఎదురుచూపు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)



విజయనగరంలో గేటు వేస్తున్న వెలుగు సిబ్బంది

ఆసరా సమావేశం ఏర్పాటు చేసిన అధికార పార్టీ నేతలు కనీస సౌకర్యాలు విస్మరించారు. బెదిరించి తీసుకువచ్చి చివరికి వదిలేశారు. సమావేశాలకు రాని వారికి రుణ మాఫీ (ఆసరా) లబ్ధి చేకూరదని అనడంతో చాలా మంది భయంతోనే హాజరయ్యారు. చాలా చోట్ల తాగునీటి ఏర్పాట్లు కూడా సక్రమంగా చేయలేదు. సమావేశాలకు వేలాది మందిని తరలించారు. వారికి అరకొర భోజన ఏర్పాట్లు చేశారు. కొన్ని చోట్ల బుధవారం ఆకలితో ఉసూరుమంటూ ఇంటిబాట పట్టడం కనిపించింది. విజయనగరం, బొబ్బిలి, గజపతినగరం, ఎల్.కోట ప్రాంతాల్లో బుధవారం జరిగిన సమావేశాల్లో లబ్ధిదారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. విజయనగరం నియోజకవర్గానికి సంబంధించి బుధవారం పట్టణంలోని రాజీవ్ క్రీడా మైదానంలో ఆసరా సమావేశం నిర్వహించారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపీ బెల్లాన, కలెక్టర్ నాగలక్ష్మి హాజరయ్యారు. మెప్మా సిబ్బంది, గ్రామాల నుంచి వెలుగు సిబ్బంది పెద్దఎత్తున లబ్ధిదార్లను తీసుకొచ్చారు. అరకొర సౌకర్యాలతో ఇబ్బందులకు గురిచేశారు. కొంత మంది భోజనానికి కూడా నోచుకోలేదు. సమావేశం జరుగుతుండగనే వెళ్లిపోయేందుకు ప్రయత్నించారు. వీరిని సిబ్బంది నియంత్రించారు.

సొమ్మసిల్లి పడిపోయిన వృద్ధులు

గజపతినగరం: స్థానిక బైపాస్ రోడ్డుకు ఆనుకొని బుధవారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా 4వ విడత కార్యక్రమానికి వలంటీర్లు, వీవోఏలు, ప్రజాప్రతి నిధులు మహిళలను భారీగా తీసుకువచ్చారు. రాకుంటే పథకాలు రద్దు చేస్తారని బెదిరించడంతో ఎలాగోలా చేరుకున్నారు. వృద్ధులు వేరొకరి సహాయంతో సభకు రావడం కనిపించింది. వారు ఎండవేడికి తట్టుకోలేకపోయారు. మరుపల్లి గ్రామానికి చెందిన గెద్ద సీతమ్మ, శ్రీరంగరాజపురం గ్రామానికి చెందిన ఇజ్జిరోతు అప్పలరాము సొమ్మసిల్లి పడిపో యారు. అక్కడే ఉన్న వైద్య సిబ్బంది సేవలు అందజేశారు. కాగా మధ్యాహ్నం 2 గంటలకు భోజనం వడ్డింపు ప్రారంభించారు. అప్పటికే ఆలస్యం కావడంతో ఎమ్మెల్యే ప్రసంగిస్తుండగానే మహిళలు కౌంటర్ వద్ద క్యూ కట్టారు. ఆ సమయంలో వారి మధ్య తోపులాట చోటుచేసుకుంది. కొందరికి భోజనం అందలేదు. దీంతో నాయకులను తిట్టుకుంటూ పాపం ఇంటికి తిరుగుముఖం పట్టారు.

బయటకు వెళ్లకుండా అడ్డగింత

బొబ్బిలి: ఆసరా నాలుగో విడత పంపిణీలో వక్తల ప్రసంగాలను భరించలేక మహిళలు బయటకు వెళ్లిపోయారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం బొబ్బిలి పట్టణం, మండలానికి సంబంధించిన లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఒక్కో ఆర్పీ కనీసం 60 మంది మహిళలను చొప్పున తప్పనిసరిగా తీసుకురావాలని అధికారులు హుకుం జారీ చేశారు. దీంతో ఆర్పీలంతా మహిళలను కాళ్లావేళ్లా పడి తీసుకొచ్చారు. వారంతా బలవంతంగా సమావేశానికి రావడంతో వైసీపీ నాయకుల ఊకదంపుడు ప్రసంగాలకు విసిగి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించారు. వారెవరూ బయటకు వెళ్లకుండా గేట్లకు అడ్డుగా ఆర్పీలు, డ్వాక్రా, మెప్మా సిబ్బంది నిలుచుకున్నారు.

భోజనానికి లేదు 'ఆసరా'

లక్కవరపుకోట : స్థానిక లేఅవుట్‌లో బుధవారం జరిగిన ఆసరా సమావేశంలో మహిళలు భోజనం కోసం అవస్థలు పడ్డారు. నిర్వహణ సరిగా లేక ఆకులు పట్టుకొని ఎవరికి వారు ఆహారం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. చాలాసేపు తోపులాట జరిగింది. అరకొర భోజనంతో సర్దుకున్నారు. దీంతో మహిళలంతా తిట్టుకుంటూ వెనుదిరిగారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతుండగానే తిరుగుముఖం పట్టారు.


మా వాళ్లే ఉండాలి!

- తహసీల్దార్ల బదిలీలపై అధికార పార్టీ నేతల దృష్టి
- ఎన్నికలకు అనువైనవారిని తెచ్చుకునే వ్యూహం
- జిల్లా ఉన్నతాధికారులపై ఒత్తిడి

శృంగవరపుకోట, జనవరి 31: ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం మూడేళ్లు పూర్తయిన అధికారులకు బదిలీ తప్పనిసరి. ఎస్.కోట నియోజకవర్గంలోని ఓ తహసీల్దార్‌కు మూడేళ్లు పూర్తికాకపోవడంతో ఇక్కడే పనిచేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఎన్నికల్లో పనితనం చూపించుకోవాలన్న కుతూహలం కూడా ఉంది. అందుకు కీలక ప్రజాప్రతినిధి అనుమతి పొందారు. అయితే ఇక్కడే వున్న మరో ప్రజాప్రతినిధికి ఆ తహసీల్దార్ ఎన్నికల సమయంలో ఇక్కడ ఉండడం ఇష్టం లేదు. బదిలీ చేయాల్సిందేనని పట్టుపడుతున్నారు. జిల్లాలో తహసీల్దార్ల బదిలీ వ్యవహారానికి సంబంధించి ఇదొక ఉదాహరణ మాత్రమే. ఇతర నియోజకవర్గాల్లోనూ ఇవే పైరవీలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

జిల్లాకు శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల నుంచి పదోన్నతిపై వచ్చిన తహసీల్దార్లకు మూడేళ్లు నిండక పోవడంతో జిల్లాలోనే పనిచేయనున్నారు. వీరిలో కొందరు ఆయా ప్రజా ప్రతినిధులకు అనుకూలంగా ఉన్నారు. కాగా జిల్లా నుంచి శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలకు బదిలీపై వెళ్లిన వారి స్థానంలో వస్తున్న తహసీల్దార్‌లలో తమకు అనువైన వారి కోసం ప్రజా ప్రతినిధులు అన్వేషిస్తున్నారు. ఇదే విధంగా తహసీల్దార్‌లు కూడా తమకు అనుకూలంగా వున్న మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులను కలుస్తున్నారు. అవకాశం కల్పిస్తే ఎన్నికల్లో అనుకూలంగా పనిచేస్తానని మాటిస్తున్నారు. అయితే ఎన్నికల నిబంధనల ప్రకారం తహసీ ల్దార్‌ల నియామకంలో ప్రజాప్రతినిధుల ప్రమేయం ఉండకూడదు. అందుకే ఈ ప్రాంతాలతో పరిచయం లేని వ్యక్తులకు తహసీల్దార్‌లుగా బాధ్యతలు అప్పగిస్తుంటుంది. కాగా వివిధ కారణాలతో జిల్లా అధికారులు ప్రజాప్రతినిధుల మాటను గౌరవిస్తారు. ఈ వాతావరణమే పైరవీలకు అవకాశం కల్పిస్తోంది.

సార్వత్రిక ఎన్నికల ఖర్చు కోసం రూ.కోట్లలో నిధులను ఎన్నికల కమిషన్ విడుదల చేస్తుంది. తహసీల్దార్‌లకు రూ.లక్షల్లో రాబడి ఉంటుందన్న విమర్శ ఉంది. నియోజకవర్గ కేంద్ర తహసీల్దార్‌కు ఇందుకు రెండు రెట్లు రాబడి ఉండడంతో ఎక్కువ మంది ఆ కీలక మండలాలపై కన్నేశారు. కొన్ని మండలాల్లో భూ లావాదేవీలు ఎక్కువగా ఉన్నాయి. ఆ మండలాల్లో తహసీల్దార్ బాధ్యతలు చేపట్టేందుకు కూడా ఎక్కువమంది మొగ్గుచూపుతారు. ఎన్నికల విధులకు ఇతర జిల్లాల నుంచి వస్తున్న తహసీల్దార్‌లు ఈ మండలాల్లో పోస్టింగ్ కోసం ప్రజాప్రతినిధుల ప్రాపకం కోసం చూస్తున్నట్లు సమాచారం. నేతలు కూడా తమ మాట వినే తహసీల్దార్‌ల కోసం వెతుకుతున్నారు. అయితే ఎన్నికల సమయంలో సమర్థమైన అధికారులు అవసరం. ఎన్నికల విధులు కత్తిమీద సాములాంటివి. దీంతో కలెక్టర్ నుంచి ఇతర ఉన్నతాధికారుల వరకు సమర్థమైన అధికారులను నియోజకవర్గ కేంద్రాల్లో నియమించాలన్న యోచనలో ఉన్నారు.



తహసీల్దార్ల బదిలీ

కలెక్టరేట్: ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్లను బదిలీ చేస్తూ సీసీఎల్ఏ కమిషనర్ జీసాయి ప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లా ప్రకారం బదిలీలు జరిగాయి. మూడు సంవత్సరాల కంటే తక్కువగా పనిచేసిన వారిని, ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్న ఆరుగురు మినహా మిగిలిన వారిని విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అంతే సంఖ్యలో విశాఖ, శ్రీకాకుళం జిల్లాల నుంచి విజయనగరం జిల్లాకు వస్తున్నారు. వీరికి మండలాల వారీగా పోస్టులను కలెక్టర్ కేటాయించనున్నారు.

విద్యుత్ బిల్లులూ చెల్లించలేరా?

- వార్డు సచివాలయాలపై ఆర్థిక భారం
- ఆరు నెలలుగా పేరుకుపోయిన బకాయిలు
- విద్యుత్ సరఫరా నిలిపివేతకు దిగిన అధికారులు
- మూడు సచివాలయాలకు కట్
- విజయనగరం కార్పొరేషన్‌లో రూ.6 కోట్ల బకాయి

(విజయనగరం రింగురోడ్డు)

సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చామని గొప్పగా చెబుతున్న ప్రభుత్వం సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదు. ఆరు నెలలు చూసిన ఆ విభాగం అధికారులు చేసేదిలేక సరఫరా నిలిపివేతకు దిగారు. బొబ్బిలి పట్టణంలోని మూడు సచివాలయాలకు బుధవారం కరెంట్ కట్ చేశారు. ఈ మున్సిపాలిటీలో 16వార్డు సచివాలయాలూ విద్యుత్ బకాయిలు చెల్లించలేదు. కాగా విజయనగరం కార్పొరేషన్లో 61వార్డు సచివాలయాలున్నాయి. ఇక్కడ కూడా ఆరునెలలుగా రూ.6 కోట్ల పైబడి బకాయిలున్నట్లు సమాచారం. విద్యుత్ బకాయిలు భారీగా పేరుకు పోతున్న కారణంగా ఫీజులు తీసేస్తామని విద్యుత్ సిబ్బంది హెచ్చరిస్తూ వచ్చారు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. కాగా నష్టాలు వచ్చాయని చూపి వివిధ కోణాల్లో ప్రజలపై అదనంగా భారం మోపడం ప్రభుత్వానికి సర్వసాధారణ మైంది. ఇప్పటికే ట్రూఅప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీలు, నష్టాల పేర్లతో జనం నడ్డి విరుస్తోంది. కార్యాలయాల బిల్లులు చెల్లించకుండా జనంపై పడుతోంది. ఇదిలా ఉండగా సచివాలయ విద్యుత్ బిల్లుల పెండింగ్ అంశాన్ని ఎస్ఈ లక్ష్మణరావు వద్ద ప్రస్తావించగా బిల్లుల పెండింగ్ వాస్తవమేనన్నారు. ప్రభుత్వ కార్యాలయాలే కనుక తాము ఎక్కడా, ఏ సచివాలయ విద్యుత్ ఫీజులు తొలగించలేదన్నారు. బకాయిల మొత్తాన్ని ప్రభుత్వానికి నివేదించామని చెప్పారు.



సాయినగర్ సచివాలయంలో విద్యుత్ సరఫరా లేక ఖాళీగా కుర్చీలు

బొబ్బిలిలో పవర్ కట్

బొబ్బిలి, జనవరి 31: బొబ్బిలి మున్సిపల్ పరిధిలోని కొన్ని సచివాలయాలకు బుధవారం విద్యుత్ శాఖాధికారులు పవర్ కట్ చేశారు. పట్టణంలో 16 సచివాలయాలు ఉండగా ఒక్కో సచివాలయం నెలవారీగా సగటున పది నుంచి పన్నెండువేల రూపాయలు బిల్లు వస్తుంటుంది. ఆరు నెలలకు గాను సుమారు రూ.11 లక్షల రూపాయలకు పైగా చెల్లించలేదు. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు చర్యలకు దిగారు. తొలుత సాయినగర్, పాతబొబ్బిలి, ఫూల్‌బాగ్ సచివాలయాలకు విద్యుత్ సరఫరా ఆపేశారు. కాగా పట్టణంలో వీధిదీపాలు, మున్సిపల్ కార్యాలయం బిల్లు, వాటర్‌వర్క్స్ విద్యుత్ బిల్లులతో కలిపి కోటి రూపాయల వరకు బకాయిలు పేరుకుపోయాయి.

ఖజానా నుంచి రావాలి

కనకరాజు, డీఈఈ, బొబ్బిలి

విద్యుత్ బిల్లుల చెల్లింపులు ప్రభుత్వ ఖజానా నుంచి నేరుగా జరుగుతాయి. ఏ నెలకు ఆ నెల బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి ప్రభుత్వానికి పంపిస్తున్నాం. దీనిపై విద్యుత్ విభాగం అధికారులకు లేఖ రాశాం. సచివాలయాలకు విద్యుత్ సౌకర్యం పునరుద్ధరించాలని కోరాం.

మాపై ఒత్తిడి ఉంది

సాంబశివరావు, విద్యుత్ ఏఈ

విద్యుత్ బకాయిల విషయంలో ఎప్పటికప్పుడు మున్సిపల్ యంత్రాంగాన్ని అడుగుతూనే ఉన్నాము. మా పైఅధికారుల నుంచి బకాయిల విషయంలో ఒత్తిడి ఎక్కువగా ఉంది. అన్ని రకాల విద్యుత్ బకాయిలపై తరచుగా డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ సంస్థల విషయంలో తొందరపడకుండా వ్యవహరిస్తున్నాం.

జేసీగా కార్తీక్ బాధ్యతల స్వీకరణ

కలెక్టరేట్, జనవరి 31: జాయింట్ కలెక్టర్‌గా కొల్లాబత్తుల కార్తీక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చిన విషయం తెలిసిందే. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు వివిధ శాఖల అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ విజయనగరం ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా నియోజకవర్గంపై దృష్టిసారిస్తానని, ఎన్నికలను సక్రమంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. రెవెన్యూ అంశాలతోపాటు అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ, పేదలందరికీ ఇళ్లు, కౌలురైతుల రుణాలు, పంట కోత ప్రయోగాలు తదితర అంశాలకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. అనంతరం రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్థక తదితర శాఖల అధికారులతో సమావేశమయ్యారు. తొలుత కలెక్టర్ నాగలక్ష్మిని మర్యాద పూర్వకంగా కలిశారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్



రిలే దీక్షలో యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

బకాయిలకు బటన్ నొక్కరెందుకు?

- యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల నిరసన

కలెక్టరేట్, జనవరి 31: సంక్షేమ పథకాల అమలులో ఎలా బటన్ నొక్కుతున్నారా? ఉద్యోగులకు రావాల్సిన బకాయిల విషయంలో బటన్ ఎందుకు నొక్కడం లేదని ముఖ్యమంత్రిని యూటీఎఫ్ నేతలు ప్రశ్నించారు. ఆర్థిక పరమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద బుధవారం రిలే దీక్షలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో పని చేస్తున్న నాలుగు లక్షల మంది ఉద్యోగులకు రావాల్సిన, వారు దాచుకున్న బకాయిలు విడుదల చేయకుండా ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ఉద్యోగులు గొంతెమ్మ కోర్కెలు కోరలేదని, తమకు రావాల్సిన డబ్బులు ఇవ్వాలని అడుగుతున్నారని అన్నారు. ఇప్పటికైనా నిధులు విడుదల చేయకపోతే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు రావల్సిన పీఎఫ్, ఏపీజీఎల్ రుణాలు, పేమెంట్లు, సరెండర్ లీవులు, పీఆర్సీ ఎరియర్స్, డీఏ బకాయిలు రూ.18,000 కోట్లు ఉండగా, కేవలం రూ.1200 కోట్లు విడుదల చేసిందని చెప్పారు. దాదాపు రూ.17,000 కోట్లు మంజూరు చేయాల్సి ఉందన్నారు. దీక్షలో సంఘ నాయకులు శ్రీనివాసరావు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

కోడ్ వచ్చే వరకూ మార్పులు

- నామినేషన్ల వరకూ ఓటు నమోదు
- ఓటర్ల జాబితాపై కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టరేట్, జనవరి 31: ఓటర్ల జాబితా సవరణలో భాగంగా ఎన్నికల కోడ్ వచ్చే వరకూ చేర్పులు, తొలగింపులకు అవకాశం ఉంటుదని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. నామినేషన్లు పూర్తి అయ్యే వరకూ ఓటు నమోదు చేసుకోవచ్చునన్నారు. అయితే ఫారం 7, ఫారం 8లు స్వయంగా ఓటరు మాత్రమే దరఖాస్తు చేయాలని, వారి తరఫున మరొకరు చేయడానికి అవకాశం లేదని చెప్పారు. తన చాంబర్‌లో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితా తుది ప్రచురణ అనంతరం కొన్ని పెండింగ్ అంశాలు వెల్లడయ్యాయని, ఫొటోలు సక్రమంగా లేనివి 1233, ఇతర ఫొటోలు ఉన్నవి 165, డూప్లికేట్స్ 597, డెత్ కేసులు 1334, తప్పు డోర్ నెంబర్లవి 383 , జంక్ డోర్ నెంబర్లు 568, ఒకే ఇంటో 10 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్నవి 21, ఒకే కుటుంబ నుంచి వేర్వేరు పోలింగ్ స్టేషన్లలో ఓటు కలిగిన వారు 162 మంది ఉన్నారని పేర్కొన్నారు. సమావేశంలో జేసీ కార్తీక్, డీఆర్వో అనిత, ఈఆర్వోలు వెంకటేశ్వరరావు, సుధారాణి, రాజకీయ పార్టీల నాయకులు ఉన్నారు.

రేంజ్‌లో 14 మంది సీఐల బదిలీ

● వేకెన్సీలో ఉన్న,
పదోన్నతి పొందిన వారికి పోస్టింగ్

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో విశాఖ రేంజ్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల బదిలీల పర్వం కొనసాగుతుంది. సీనియర్లతోపాటు తాజాగా సీఐలుగా పదోన్నతి పొందిన అధికారులకు పోస్టింగ్స్ ఇస్తూ రేంజ్ డీఐజీ హరికృష్ణ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. రేంజ్ వేకెన్సీ రిజర్వులో ఉన్న సీఐలు సి.సూర్యనారాయణకు శ్రీకాకుళం జిల్లా స్పెషల్ బ్రాంచ్ (ఎక్స్)లో, అడబాల రవికుమార్‌కు విజయనగరం జిల్లా భోగాపురం యూపీఎస్‌లో, ఏవీ లీలా రావుకు విజయనగరం జిల్లా ట్రైనింగ్ సెంటర్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ఇంకా సాలూరు రూరల్ సీఐ ఎస్.ధనుంజయ రావును అనకాపల్లి రూరల్ స్టేషన్ సీఐగా, పార్వతీపురం మన్యం జిల్లా కొటియా సీఐ బి.రోహిణీపతిని అదే జిల్లాలో స్పెషల్ బ్రాంచి (ఎక్స్)కు, అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సీఐ నమ్మి గణేష్‌ను అనకాపల్లి జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు, విజయనగరం ట్రైనింగ్ సెంటర్‌లో ఉన్న ఎం.చంద్రశేఖర్‌ను విశాఖ రేంజ్‌కు పంపారు. తాజాగా పదోన్నతి పొంది పోస్టింగ్ కోసం రేంజ్‌లో ఎదురుచూస్తున్న గేదెల బాల కృష్ణను పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు రూరల్ సీఐగా, కింతల నారాయణరావును కొటియా సీఐగా, ముదిలి శ్రీనివాసరావును విజయనగరం రూరల్ సీఐగా, డి. దీన బంధును అనకాపల్లి దిశ స్టేషన్ సీఐగా, టి.క్రాంతి కుమార్‌ను అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సీఐగా, ఎస్.సన్యాసినాయుడు అల్లూరి జిల్లా పాడేరు సీఐగా, బమ్మిడి అప్పలనాయుడును గూడెంకొత్తవీధి సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

అప్పలనాయుడు సేవలు మరవలేనివి

లక్కవరపుకోట: మండలంలోని గంగుబూడి వీఆర్వో దాకారపు అప్పలనాయుడు సేవలు మరువలేనివని తహసీల్దార్ కల్యాణచక్రవర్తి అన్నారు. బుధవారం అప్పలనాయుడు పదవీవిరమణ చేశారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు దంపతులను తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖ సిబ్బంది సత్కరించారు.

రక్తదానం సామాజిక బాధ్యత

విజయనగరం రింగురోడ్డు: రక్తదానం సామాజిక బాధ్యతని యువత రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని నా వూరు విజయనగరం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు గుమ్మలూరి విశాలక్ష్మీ అన్నారు. బుధవారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌వీఎస్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో 40 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధి రాము, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సెబ్ అదనపు ఎస్పీ వెంకటరావు బదిలీ

విజయనగరం క్రైం: రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఎస్పీలను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. విజయనగరం స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో అదనపు ఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్ వెంకటరావును విశాఖపట్టణం సిటీ అడిషనల్ డీసీపీ ఎస్‌బీకి బదిలీ చేశారు.

గ్రంథాలయానికి కుర్చీలు

శృంగవరపుకోట: శృంగవరపుకోట శాఖా గ్రంథాలయానికి బుధవారం కొత్తవలస పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ చింతాడ వెంకట్ (నాని) నాలుగు వేలు రూపాయల విలువ చేసే రీడింగ్ చైర్స్, ఐదు రీడింగ్ ప్లాంక్స్‌ను బుధవారం అందించారు. ఈ కుర్చీలు పాఠకులకు బాగా ఉపయోగపడతాయని గ్రంథాలయ అధికారి శ్రీధర్ తెలిపారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

రామభద్రపురం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు అన్నారు. బూసాయవలసలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు దూరదృష్టి గల నాయకుడని కొనియాడారు. ఒక్క ఛాన్సు పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని ఆరోపించారు. టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగుదేశం శ్రేణులు ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలపై చైతన్యవంతులను చేయాలని సూచించారు. దేశం అభ్యర్థి బేబీనాయన గెలుపు తథ్యమని అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతినాయుడు పాల్గొన్నారు.

పాతబొబ్బిలిలో రక్తదాన శిబిరం

బొబ్బిలి: పట్టణ పరిధిలోని పాతబొబ్బిలిలో మాతృభూమి సేవా సంఘం అధ్యక్షుడు పి.నాయుడు (పండు) ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు, రాష్ట్ర లోక్‌సత్తా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, బూర్లి పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల కుటుంబానికి పరామర్శ

లక్కవరపుకోట: ఎస్.కోట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కుటుంబాన్ని బుధ వారం వివిధ పార్టీల నాయకులు పరామర్శించారు. దివంగత అప్పలనాయుడు భార్య పైడితల్లమ్మ ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే. లలితకుమారి దంపతులను టీడీపీ నేత విజయనగరం పార్లమెంట్ అధ్యక్షుడు కిమిడి నాగార్జున, ఎమ్మెల్సీ రఘురాజు, రాష్ట్ర కొప్పలవెలమ సంఘ అధ్యక్షుడు నెక్కల నాయుడుబాబు, సూరితాత, మేలాస్త్రీ అప్పారావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ఒబ్బిన సత్యనారాయణ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

బాధ్యతలు చేపట్టిన టూటౌన్ సీఐ


రామారావు

విజయనగరం క్రైం: విజయనగరం టూటౌన్ పోలీసు స్టేషన్ సీఐగా కోరాడ రామారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు.. ఈయన విశాఖపట్టణం సిటీ త్రీ టౌన్‌లో సీఐగా బాధ్యతలు నిర్వర్తించి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈయన విజయనగరం వన్‌టౌన్‌లో గతంలో సమర్థంగా శాంతిభద్రతల పరిరక్షణలో విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను జిల్లా కేంద్రంలో బాధ్యతలు చేపట్టానని, ప్రజల సహకారంతో శాంతిభ ద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

మద్యపాన నిషేధమేదీ?

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు


ప్రజలకు హామీ పత్రం చూపించి వివరిస్తున్న అదితి, టీడీపీ నాయకులు

విజయనగరం రూరల్, జనవరి 31: ప్రతిపక్షనేతగా ఊరూరా తిరిగి, మద్య నిషేదం చేస్తానని హామీ ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి, అధికారం చేపట్టాక ఆ ఊసేత్తడం లేదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు చెప్పారు. టీడీపీ రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకి గ్యారెంటీ' కార్యక్రమాన్ని బుధవారం నగరంలోని 28, 8 డివిజన్ల పరిధిలో నిర్వహించారు.ఈ సందర్భంగా అదితి గజపతిరాజు మాట్లాడుతూ, మద్యనిషేధం జాడ లేకపోగా, రాష్ట్ర ప్రభుత్వం మద్యం అంశాన్ని వదలకుండా ఆ పేరు మీద కూడా 30 ఏళ్ల కాలపరమితితో అప్పులు వాడేసిందన్నారు. మద్యనిషేధం చేస్తానని చెప్పిన వ్యక్తి, మద్యంపై అప్పు చేయడం ఎంత దారుణమో ప్రజలు ఆలోచించాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం రానున్న ఎన్నికల్లో టీడీపీకి ప్రజలు పట్టం కట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సారిక వెంకటరమణతో పాటు, నియోజకవర్గ నాయకులు, 28, 8 డివిజన్‌ల పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ

జామి: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరిస్తేనే రాష్ట్రంలో ఐదు కోట్ల ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని గజపతినగరం మాజీ శాసన సభ్యుడు కొండపల్లి అప్పలనాయుడు అన్నారు. బుధవారం వెంకటరాజుపాలెం గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు స్వామినాయుడు ఆధ్వర్యంలో భవిష్యత్ కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తలి సూర్యారావు, చైతన్య, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలన తప్ప అభివృద్ధి లేదు

● కోండ్రు మురళీమోహన్ ● టీడీపీలోకి భారీగా చేరికలు


రాజాం: పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న కోండ్రు మురళీమోహన్

రాజాం: వైసీపీ ప్రభుత్వంలో సామాజిక న్యాయం కరువైందని, అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అరాచక పాలన తప్ప ఎటువంటి అభివృద్ధి జరగలేదని రాజాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ ఆరోపించారు. బుధవారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో గెడ్డవలస, అంతికాపల్లి గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు బూరాడ తిరుపతినాయుడు, పారంనాయుడు, రెడ్డి తవిటినాయుడు, బి.యుగంధర్, పి.మల్లిబాబు, రెడ్డి నారాయణరావు, పైల కృష్ణ తదితరులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కోండ్రు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నిరంకుశత్వ వైఖరితో ప్రజలు పూర్తిగా విసుగుచెందా రన్నారు. రూరల్ పార్టీ అధ్యక్షుడు సుమల వెంకట మన్మథరావు, గెడ్డవలస సర్పంచ్ కొయ్యాన జగదీష్, గురవాన నారాయణరావు, వంగా వెంకటరావు, పొన్నాడ భీమేశ్వరరావు, రఘుమండల గణపతినాయుడు, జరజాన నీలయ్య, బూరాడ సింహాచలం, బూరాడ సతీష్, టంకాల సతీష్, రెడ్డి అప్పలనాయుడు, బంగారు నాయుడు, మాడుగుల జయరాం పాల్గొన్నారు.


బొబ్బిలి: పార్టీలో చేరినవారితో బేబీనాయన, తెంటు

బొబ్బిలి: బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని రామభద్రపురం మండలం గొల్లలపేట పంచాయతీలోని పలు గ్రామాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు బుధవారం బొబ్బిలి కోటకు వచ్చి తెలుగుదేశం పార్టీలో చేరారు. జోగిందరవలస, కర్రిందొరవలస, అప్పలరాజుపేట, గొల్లల పేట గ్రామాలకు చెందిన సుమారు 110 వైసీపీ కుటుంబాల వారు నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ గ్రామాలకుచెందిన వార్డు మెంబర్లు మునకాల చినబాబు, బాలి రామకృష్ణ, బోయి న పెంటయ్య, జన్ని రామారావు, కురిటి పెంటయ్య, బంటు శ్రీనివాసరావు, బొత్స సింహాచలం, అల్లాడ బంగారినాయుడు, జల్దిగంపల రామ్మూర్తి తదితరులు పార్టీ లో చేరినవారిలో ఉన్నారు. పార్టీ సీనియర్ నేతలు అల్లాడ భాస్కరరావు, కర్రోతు తిరుపతిరావు, మడక తిరుపతినాయుడు, కరణం భాస్కరరావు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని గూడెపువలస పంచాయతీ పరిధిలో అల్లువానివలస, గూడెపువలస, రావివలస గ్రామాల నుంచి 50 కుటుంబాలు వైసీపీని వీడి బొబ్బిలి టీడీపీ ఇన్‌చార్జి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు సమక్షంలో బుధవారం గూడెపువలసలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. మాజీ ఎంపీటీసీ చల్ల సన్నమ్మ, ఆమె భర్త త్రినాథనాయుడు, చల్ల సత్యనారాయణను పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. దీనికి ముందుగు మూడు గ్రామాల్లో వాడ వాడవాల బేబీనాయన, తెంటులు ఊరేగుతూ బాణా సంచాకాల్చి, మేళతాళాలతో వెళ్ళారు. పలువురు మహిళలు హారతులిచ్చి ఘనస్వాగతం పలికారు. పూడి అప్పలనాయుడు, రావిపల్లి సత్యనారాయణ, అన్నాదేవుల విశ్వనాథరాజు, ఎచ్చెర్ల శ్రీనివాసరాజు, కొరుపుపాటి పోలిరాజు, మండపేట శివరాజుతోపాటు పలువురు చేరిన వారిలో ఉన్నారు. తెంటు రవిబాబు, కొల్లి అప్పలనాయుడు, సింగిరెడ్డి భాస్కరరావు, బొంతు త్రినాథనాయుడు పాల్గొన్నారు. ● గూడెపువలస గ్రామంలో జయహో బీసీ సభను విజయనగరం జిల్లా పార్లమెంటరీ బీసీ సాధికారిత కొప్పలవెలమ కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ ఇన్‌చార్జ్ బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు హాజరయ్యారు. కార్యక్రమంలో బీసీ నాయకులు తెంటు రవిబాబు, బొంతు త్రినాథనాయుడు, చల్లా తిరుపతినాయుడు, సింగిరెడ్డి భాస్కరరావు, పామోటి గోవిందరావు, మత్స త్రినాథనాయుడు, గొట్టాపు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ వ్యవహారంపై విచారణ చేయాలి

● కోండ్రు మురళీమోహన్

రేగిడి: రేగిడి మండలానికి సరఫరా చేసిన సిమెంట్ వ్యవహారంపై విచారణ చేసి, వాస్తవాలు బయటపెట్టాలని రాజాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని సోమరాజుపేటలో గల రేగిడి పీఆర్ ఏఈ రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా సిమెంట్ వ్యవహారంపై అధికారులు, వైసీపీ నేతలు తీవ్ర ఒత్తిళ్లతో తన భర్తను మనసికక్షోభకు గురిచేసి, ప్రాణం తీశారని రామకృష్ణ భార్య ఉమ ఆరోపించారు.ఈ వ్యవహారంలో ఆయన్ను ఒక్కడినే బలి పశువు చేసి ఆడుకున్నారని, తాను పిల్లలతో ఉన్నానని, తనకు న్యాయం చేయా లని రోదించారు. మురళీమోహన్ మాట్లాడుతూ ఈఘటనకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. ఏఈ కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అంతకు ముందు ఆమదాలవలస, ఖండ్యాం గ్రామాల్లో టీడీపీ నాయకులకు చెందిన వ్యక్తులు మృతి చెందడంతో ఆయా కుటుంబాలను కోండ్రు పరామర్శించారు. టీడీపీ నేతలు దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌కుమార్, గురవాన నారా యణరావు, కర్ణేన మహేశ్వరరావు, పాలూరి రామినాయుడు, గేదల బాల మురళి, సర్పంచ్ బూడి ఆదినారాయణ, మజ్జి శ్రీనివాసరావు, గురువాన ధనంజయ్‌రావు ఉన్నారు.

బాలికావలసలో మరుగుదొడ్డి నిర్మాణానికి చర్యలు

రేగిడి: మండలంలోని బాలికావలస పాఠశాల ఆవరణలో మరుగుదొడ్డి నిర్మాణానికి చర్యలు చేపట్టారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రంలో మౌలిక సౌకర్యాల కల్పనలో భాగంగా బాలికావలస ప్రాథమిక పాఠశాలకు మరుగుదొడ్డి సౌకర్యం లేదు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లింది. దీంతో తక్షణమే మరుగుదొడ్డి నిర్మా ణానికి స్థానిక యంత్రాంగం యుద్ధప్రాతిపాదికన చర్యలు చేపట్టింది. ఈమేరకు ఎంఈవో వరప్రసాదరావు, సర్పంచ్ వి.చంద్రశేఖర్, హెచ్ఎం ఎస్.షైమావతి ఆధ్వర్యంలో గురు వారం మరుగుదొడ్డి నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. దీని నిర్మాణానికి కలెక్టర్ రూ. 43వేలు కేటాయించగా, హెచ్ఎం షైమావతి రూ10వేలు, సర్పంచ్ చంద్ర శేఖర్ మరికొంతమంది విరాళాలతో రూ.83వేలు అంచనాతో పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఎంఈవో తెలిపారు.

టీడీపీ ఇన్‌చార్జి సొంత నిధులతో బోరు ఏర్పాటు

తెర్లాం: మండలంలోని డి.గదబవలస గ్రామంలో బుధవారం ఉదయం కొత్త కోనేరు వద్ద సర్పంచ్ జావాన రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో బొబ్బిలి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ బేబీనాయన సొంత నిధులతో బోరును రజకులకు బట్టలు ఉతికేందుకు అవసరం నిమిత్తం ఏర్పాటు చేశారు. రజకులు బట్టలు ఉతికేందుకు నీరులేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను సర్పంచ్ జావాన రమేష్‌నాయుడు, టీడీపీ నాయకుల దృష్టికి తీసుకువెళ్లగా బేబీనాయన చెప్పిన వెంటనే స్పందించి బోరు వేయించారు.

టీడీపీ వార్డులకు అన్యాయం జరుగుతోంది

● కౌన్సిల్ సమావేశంలో ఆ పార్టీ కౌన్సిలర్ల ధ్వజం


విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ కౌన్సిలర్లు

బొబ్బిలి, జనవరి 31: మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో ప్రజలకు ఒరిగిందేమీ లేదని టీడీపీ కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గెంబలి శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు మాట్లాడారు. తాము గెలిచిన తరువాత ఇది మూడో బడ్జెట్ సమావేశమని, ఎటువంటి అభివృద్ధి పనులు చేసుకోలేకపోయామన్నారు. కోట్ల రూపాయల జనరల్ ఫండ్ నిధులన్నిటినీ వైసీపీ వార్డులకు మాత్రమే ఖర్చు చేస్తున్నారని, టీడీపీ వార్డులను అసలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అజెండాపై పూర్తి చర్చ ఉండదని, జీరో అవర్‌లో మాట్లాడదామని చెబుతూనే వెనువెంటనే వాయిదా వేసి పారిపోతారన్నారు. ప్రజాసమస్యలు అడిగితే ఎదురుదాడికి దిగుతున్నారన్నారు. గ్రంథాలయం భవన సమస్యపై జనసేన నాయకుడు అల్టిమేటమ్ ఇచ్చి మరీ నిరాహార దీక్ష చేపట్టారని, దానిని పట్టించుకోకుండా టీడీపీ నాయకులపై చైర్మన్ లేనిపోని విమర్శలు చేయడం అర్థరహితమన్నారు. 14 వ ఆర్థికసంఘం నిధులు తప్ప మరే అభివృద్ధి లేదని దుయ్యబట్టారు. ప్రతిపక్ష కౌన్సిలర్లకు కనీస గౌరవం ఇవ్వడం లేదన్నారు. టీడీపీ కౌన్సిలర్లు వెలగాడ షైమావతి, కింతలి శ్రీదేవి, దాసరి రమేష్, కళ్యంపూడి లక్ష్మి, బొత్స అప్పులు తదితరులు మాట్లాడారు.

ఐటీడీఏలో చేర్చి పుణ్యం కట్టుకోండి సార్

● పార్వతీపురం పీవో విష్ణుచరణ్‌ను కోరిన చిట్టంపాడు గిరిజనులు


గిరిజనులతో మాట్లాడుతున్న పార్వతీపురం ఐటీడీఏ పీవో విష్ణుచరణ్

శృంగవరపుకోట రూరల్, జనవరి 31: గిరిశిఖర గ్రామం బొడ్డవర పంచాయతీ చిట్టంపాడులో చోటుచేసుకుంటున్న పరిణామాలు, అక్కడి పరిస్థితులు, మరణాల నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' కథనాలపై పార్వతీపురం ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ స్పందించారు. బుధవారం ఉదయం ఆయన తన అనుచర గణంతో గిరిజన యువత ఆధ్వర్యంలో చిట్టంపాడు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ 'సార్ మేం పేరుకే గిరిజనులం. మాకు ఐటీడీఏ పథకాలు అందడం లేదు. ఐటీడీఏ పార్వతీపురం వెళ్లిపోయాక వైద్య సేవలు చాలా భారంగా మారాయి. విశాఖపట్నం కేజీహెచ్‌కు వెళితే మేం షె డ్యూల్ ఏరియా గిరిజనులం కాదని...మాకు అక్కడ ఏదీ ఉచితం కాదంటున్నారు. డబ్బులు ఖర్చు చేసి వైద్యం పొందడం తలకు మించిన భారంగా మారింది. రోడ్డు సదుపాయం లేకపోవడం వల్ల అనారోగ్యం పాలైతే డోలీయే దిక్కు. ఇటీవల కాలంలో ముగ్గురు చనిపోయారు. రోడ్డు నిర్మించండి. మాకు పోడు పట్టాలు ఇప్పించండి. సెల్‌టవర్లు వేయించండ'ంటూ తమ సమస్యలు ఏకరువు పెట్టారు. వీటిని సావధానంగా విన్న పీఓ మాట్లాడుతూ గిరిజన గ్రామాలను ఐటీడీఏలో కలపాలని గత ఏడాది ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయని... అవి ఇంకా కార్యరూపం దాల్చలేదన్నారు. విశాఖ జిల్లా అటవీ ప్రాంతంలో ఈ గ్రామాలు ఉండడంతో పోడు పట్టాల విషయమై పాడేరు ఐటీడీఏ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. కొండ దిగువ భాగంలో గర్భిణులకు, బాలింతలకు వసతి గృహం ఏర్పాటు చేయాలని కొందరు కోరగా... పరిశీలిస్తామన్నారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, గిరిజన సంఘ నాయకులు గౌరీష్, అప్పలరాజుదొర తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటిస్ విధానం రద్దు చేయాలి

శృంగవరపుకోట: డీఎస్‌సీ నోటిఫికేషన్‌లో అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వి.రమణ డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రి వర్గం 6,100 ఉపాధ్యాయ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని తీర్మానించడం హర్షించదగ్గ విషయమన్నారు. అప్రెంటిస్ విధానాన్ని తిరిగి అమలు చేస్తామని ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. గత ఐదేళ్లుగా ప్రకటించకుండా ఎన్నికల ముందు ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులకు ఆశ చూపుతున్నారన్నారు. మెగా డీఎస్సీ అంటూ ఊరించిన ప్రభుత్వం తక్కువ పోస్టులతో నిరాశ పరిచిందని విచారం వ్యక్తం చేశారు. మండల శాఖ అధ్యక్షుడు ఎం.వి.ఎ.నారాయణ, ఆశపు శ్రీనివాస్, జి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

అంజన్నను దర్శించుకున్న కోళ్ల


ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న కోళ్ల దంపతులు

లక్కవరపుకోట, జనవరి 31: మండలంలో ప్రసిద్ధి చెందిన నిడిగట్టు అంజన్నను ఎస్.కోట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దంపతులు దర్శించుకున్నారు. బుధవారం గనివాడ పంచాయతీ నిడిగట్టు గ్రామంలో గ్రామస్థులు తీర్థమహోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు లలితకుమారి దంపతులు, పార్టీ నేతలు హాజరై ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాలీబాల్ పోటీలను గ్రామ స్థులు నిర్వహించారు. టీడీపీ రాష్ట కార్యనిర్వాహక కార్యదర్శి రాంప్రసాద్ పోటీ లను ప్రారంభించారు. మండల పార్టీ అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు, మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, రమేష్, జనసేన సమన్వయకర్త సత్యనారాయణ పాల్గొన్నారు.

జామిలో ఎలక్షన్ కమిషన్ డే ర్యాలీ

జామి, జనవరి 31: మండలం కేంద్రమైన జామిలో తహశీల్దార్ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో ఎలక్షన్ కమిషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేపట్టారు. ఎన్నికల కమిషన్ పనితీరుపై ప్రజలకు అవగాహన కల్పించారు.



జామిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అతివేగానికి మూగజీవాలు బలి

● రైతుకు తీవ్ర గాయాలు


ఘటనా స్థలంలో విలపిస్తున్న రైతు కుటుంబ సభ్యులు

జామి, జనవరి 31: జామి-భీమసింగి మార్గంలో బుధవారం వేకువ జామున ఒక లారీ డ్రైవర్ అతివేగానికి రెండు ఎడ్లు మృతి చెందగా... బండిపై ఉన్న రైతు మూనురు ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామయ్యపాలెం గ్రామానికి చెందిన మూనురు ప్రసాద్ తన ఎడ్లబండిపై చెరుకును భీమసింగి సుగర్స్‌కు తరలిస్తున్నాడు. దొండపర్తి జంక్షన్ దాటి కొంచెం ముందుకు వెళ్లగానే వెనుక నుంచి ఒక బొగ్గు లారీ వచ్చి ఎడ్లబండిని వేగంగా ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే రెండు ఎద్దులు చనిపోగా... రైతు తీవ్రంగా గాయపడ్డాడు. ఉదయం ఐదు గంటల సమయంలో ఈ సంఘటన జరగడంతో రోడ్డుపై వాకింగ్ చేస్తున్న వారు వెంటనే 108కి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు విజయనగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ అతివేగంతో పాటు ఉదయం మంచు ఎక్కువగా కురవడం కూడా ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు. బాధితుడు ప్రసాద్‌కు ఆధారమైన బండి పూర్తిగా దెబ్బతినగా ఎద్దులు మరణించడంతో అతని కుటుంబ సభ్యుల రోదన కంటతడి పెట్టించింది. ● ప్రస్తుతం మండలంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం జరుగుతోంది. దీని కోసం విశాఖపట్నం నుంచి లారీలతో కొద్దినెలలుగా పెద్దఎత్తున బుగ్గిని తరలిస్తున్నారు. ఈ బుగ్గిని రవాణా చేసే మాఫియా అర్ధరాత్రి నుంచి వేకువ జాము వరకు ప్లాంట్‌ల నుంచి పరిమితికి మించి తీసుకొస్తూ సొమ్ము చేసుకుంటోంది. ఈ వాహనాలు అతివేగంగా వెళ్తుండడం, వీటి వల్ల రోడ్లు దెబ్బ తింటున్నాయని, వీరిపై సంబంధిత శాఖ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


గోవింద (ఫైల్)

లక్కవరపుకోట, జనవరి 31: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ గోపాలరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేపాడ మండలం చినగుడిపాల గ్రామానికి చెందిన భోజంకి గోవింద(51) తాటి చెట్ల కోతే వృత్తిగా జీవనోపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం తాటిచెట్టు కోయడానికి కల్లేపల్లి గ్రామం వెళ్లాడు. ఆ గ్రామంలో గోకేడవారి కళ్లాల వద్ద తాటి చెట్లను కోయడానికి సిద్ధమవుతూ తోటి పనివారితో కలిసి దారికి అడ్డంగా ఉన్న ముల్లులను తొలగిస్తుండగా భుజంపై ఉన్న ఇనుప నిచ్చెన పైనున్న విద్యుత్ వైర్లకు తగలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై గోవింద స్పృహ కోల్పోయి పడిపోవడంతో వెంటనే తోటి పనివారు చికిత్స నిమిత్తం ఎస్.కోట సామా జిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

కురుపాం రూరల్: కురుపాం మండలం తిత్తిరి పంచాయతీ, గేదెలగూడ గ్రామానికి చెందిన ఆరిక రావియ్య(16) అనే బాలిక బుధవారం గడ్డిమందు తాగి ఆత్మహత్యా యత్నం చేసింది. ఈమెను నీలకంఠాపురం ఆసుపత్రిలో చేర్చగా, ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్య సహాయం అందించారు. పరిస్థితి విషమించడంతో పార్వతీపురం జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యా యత్నానికిగల కారణాలు తెలియాల్సి ఉంది.

గంజాయి స్వాధీనం.. ముగ్గురి అరెస్టు


గంజాయితో పట్టుబడిన నిందితులతో పోలీసులు

పాచిపెంట, జనవరి 31: అక్రమంగా తరలిస్తున్న 4 కేజీల గంజాయిని పట్టుకొని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని సాలూరు సీఐ ధనంజయరావు తెలిపారు. మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద బుధ వారం వాహనాల తనిఖీ సమయంలో నడుచుకుంటూ వెళ్తున్న ముగ్గురి వద్ద గంజాయిని పట్టుకున్నామన్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన జితేంద్రకుమార్, రహీరాజ్‌పుత్, బోలానాథ్ ఒడిశా ప్రాంతం జైపూర్ నుంచి ఉత్తరప్రదేశ్‌కు తరలించేందుకు వెళుతున్నారని తెలిపారు. పాచిపెంట ఎస్ఐ పి.నారాయణరావు, సిబ్బంది తనిఖీ సమయంలో పట్టుబడ్డారని తెలిపారు.

రాజాం మునిసిపల్ కమిషనర్‌గా అప్పలనాయుడు


బాధ్యతలు స్వీకరిస్తున్న అప్పలనాయుడు

రాజాం: రాజాం మునిసిపల్ కమిషనర్‌గా జె.అప్పలనాయుడు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన కమిషనర్ గుంటూరుకు బదిలీపై వెళ్ల డంతో ఆయన స్థానంలో పార్వతీపురం కమిషనర్‌గా పనిచేసిన అప్పలనా యు డును నియమించారు. అయితే పాత కమిషనర్ రెం డునెలలుగా సెలవులోనే ఉండడంతో మేనేజరు ఎంవీ నాగరాజు ఇంతవరకు ఇన్‌చార్జి బాధ్యతలను నిర్వహించారు. దీంతో మేనేజర్ నాగరాజు నుంచి చార్జీ తీసుకున్నారు.

పైపులైను లీకేజీ..


వృథాగా కాలువల్లో పోతున్న తాగునీరు

బొబ్బిలి, జనవరి 31: స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి దగ్గర పాత రైల్వే గేటు సమీపంలో బుధవారం వేకువ జామున మున్సిపల్ తాగునీటి ప్రధాన పైపులైన్‌కు లీకేజీ ఏర్పడడంతో పెద్దఎత్తున తాగునీరు వృథాగా పోతోంది. ముందు రోజు రాత్రి నుంచి ఇలా నీరు పోతుండడంతో చుట్టుపక్కల గల ఖాళీ భూముల్లో నీరు చేరి చెరువులా కనిపిస్తోంది. రైల్వే ఆధ్వర్యంలో కొత్తగా కాలువల నిర్మాణ పనులు జరుగుతుండడంతో ము న్సిపల్ పైపులైను దెబ్బతింది. దీనితో భారీగా నీరు వృథాగా పోతోంది. సమాచారం తెలిసిన వెంటనే అక్కడికి వెళ్లి పరిశీలించామని మున్సిపల్ డీఈఈ కనకరాజు తెలిపారు. రైల్వే పనులు జరుగుతుండడంతో పైపు లైను పాడైందని, నివారణ చర్యలు చేపట్టామని తెలిపారు.

టీడీపీలోనే బీసీలకు సముచిత స్థానం

● పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి బంగార్రాజు



మాట్లాడుతున్న కర్రోతు బంగార్రాజు

భోగాపురం: బీసీలకు సముచిత స్థానం టీడీపీలోనే అని పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. పోలిపల్లి గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు గుర్తింపునిచ్చి రాజ్యాధికారం లభించింది టీడీపీలోనే అన్నారు. వైసీపీ ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం చేయడంతో పాటు బీసీలను అన్ని విధాలా అణగదొక్కుతోందన్నారు. బీసీ సమస్యలపై పోరాడుతున్న నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. అంతకముందు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎన్ని సన్యాసినాయుడు, రాష్ట్ర కొప్పల వెలమల కన్వీనర్ అల్లు విజయకుమార్, రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ పొగిరి పైడిరాజు, పార్లమెంట్ రెడ్డిక సాధికార సమితి కన్వీనర్ నీలాపు అప్పలరామిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి దాసరి అప్పలస్వామి, ఎంపీటీసీలు పిడుగు వెంకట సత్యం, బాబాజీ, పార్టీ మండల ఉపాధ్యక్షుడు కోలా రామసూరి, పార్లమెంటు తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి కర్రోతు రాజు, కోరాడ తాతారావు, గరె వెంకట రమణ, బడె నాయుడు, బుగత రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీలకు న్యాయం చేయండి



వినతిపత్రం ఇస్తున్న రాజశేఖర్

కొత్తవలస: ఓబీసీలకు న్యాయం చేయాలని ఈస్టుకోస్టు రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్‌శర్మను కోరినట్టు ఆలిండియా ఓబీసీ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.రాజశేఖర్ తెలిపారు. కొత్తవలసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశాఖపట్టణంలోని వీఆర్ఎం కార్యాలయానికి వచ్చిన శర్మను మర్యాదపూర్వకంగా కలిసినట్టు తెలిపారు. ముఖ్యంగా వాల్తేరు డివిజన్‌లో ఓబీసీ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు ఆయనకు తెలిపామన్నారు. ఓబీసీ కార్మికులపై కక్ష సాధింపు చర్యలు, ఆఫీసు బేరర్స్‌ను అసంబద్ధ బదిలీలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పామన్నారు. పార్లమెంట్ చట్టాల ద్వారా ఓబీసీలకు కల్పించిన రాయితీలను తమకు అమలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరినట్టు రాజశేఖర్ తెలిపారు.

'ఆయుష్మాన్' కార్డులను పంపిణీ చేయాలి



ఆందోళన చేస్తున్న దృశ్యం

విజయనగరం దాసన్నపేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ కార్డులను ప్రజలందరికీ తక్షణమే పంపిణీ చేయాలని బీజేపీ కోర్ కమిటీ సభ్యులు భవిరెడ్డి శివప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య భద్రతా కార్డులను అర్హులైన పట్టణ ప్రజలకు పంపిణీ చేయాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసినా నేటికీ అందించకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమంచి సుబ్బారావు, బొబ్బిలి శ్రీను, సుధీర్, అమ్మాజీ, గిరిబాబు, గండికోట శాంతి, గోపాలకృష్ణ, నీలాపు దేవి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టం కలుగకుండా చూడాలి



దేవాడలో రైతులతో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కొత్తవలస: సుజల స్రవంతి భూ నిర్వాసితులకు నష్టం జరగకుండా అలైన్‌మెంట్‌లో మార్పులు చేయాలని పోరాట కన్వీనర్ చల్లా జగన్ కోరారు. ఇందుకు సంబంధించి ఫిబ్రవరి 2న తాటిపూడి వద్ద నిర్వహిస్తున్న సభకు వేలాది మంది రైతులు తరలి రావాలని పిలుపునిచ్చారు. బుధవారం దేవాడలో నిర్వహించిన రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ సుజల స్రవంతితో రైతులకు నష్టం జరగకుండా కాలువ అలైన్‌మెంట్‌లో మార్పులు చేయాలని కోరుతున్నామని తెలిపారు. భూములు కోల్పోతున్న రైతులందరికీ 2013 భూసేకరణ చట్టం కింద న్యాయం చేయాలన్నారు. కొత్తవలస, వేపాడ, లక్కవరపుకోట, శృంగవరపుకోట మం డలాల రైతులతో ముందుగా సమావేశాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఫిబ్రవరి 2న నష్టపోయిన రైతులతో పెద్ద ఎత్తున సమావేశం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటి సభ్యుడు గాడి అప్పారావు, రైతులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి అనిత ఎంపిక

విజయనగరం రింగురోడ్డు: మహారాజా స్వయం ప్రతిపత్తి కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వలంటీర్ సానుబిల్లి అనిత జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సాంబశివరావు తెలిపారు. బుధవారం తన చాంబర్‌లో అనితను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 5 నుంచి 11 వరకూ పంజాబ్ రాష్ట్రంలో గల రాజ్‌పురాలో ఉన్న చిట్కారా విశ్వవిద్యాలయంలో జరగబోయే ఏడు రోజుల శిబిరానికి ఆమె ఎంపికైందన్నారు. మొత్తం పది మంది విద్యార్థుల్లో అనిత ఒకరన్నారు. మన రాష్ట్ర సంస్కృతీ సంప్రదాయాలను తెలిపేందుకు 10 మంది వలంటీర్లను ఆంధ్రా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఎంపిక చేసిందని తెలిపారు. ఈ అభినందన సభలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జి.చంద్రశేఖర్, కన్వీనర్లు డి.సన్యాసిరావు, వి.బాబ్జీ, ఎస్.నవీన్ కుమార్, ప్రోగ్రాం అధికారులు పీఎస్‌బీ శర్మ, చిన్నంనాయుడు పాల్గొన్నారు.

'భోజన' నిర్వాహకుల వేతనం పెంచాలి



ఎంఈవోకి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

విజయనగరం దాసన్నపేట: మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనం రూ.10 వేలకు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జగన్మోహన్‌రావు, కార్మిక యూనియన్ నాయకులు రమాదేవి, అరుణలు డిమాండ్ చేశారు. వేతనం పెంచాలని కోరుతూ విజయనగరం మండల విద్యాశాఖాధికారి రాజుని కలిసి వినతిపత్రం అందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రూ.10 వేలు ఇస్తామన్న హామీని అమలు చేయాలన్నారు. డిమాండ్ల సాధనకు ఈ నెల 5న డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు.

అంకితభావమే ఉన్నతంగా నిలుపుతుంది



పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులతో ఎస్పీ

విజయనగరం క్రైం: విధుల్లో చూపిన క్రమశిక్షణ, అంకితభావమే ఉన్నతంగా నిలుపుతుందని ఎస్పీ ఎం.దీపిక అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ట్రాఫిక్ ఎస్ఐ విజయవర ప్రసాద్‌రావు, ఏఆర్ ఎస్ఐ ములగపాటి వెంకట రమణలకు ఎస్పీ దీపిక బుధవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్పీ జావలి అల్ఫాన్స్, ట్రాఫిక్ డీఎస్పీ విశ్వనాథ్, ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, సీఐలు విజయానాథ్, నర్సింహమూర్తి, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లు పరిశీలన



నిర్వాహకులతో చర్చిస్తున్న పోలీసులు

కొత్తవలస: ఈనెల 4న జరగనున్న కొండ డాబా వ్యాకులమాత జాతరకు సంబంధించిన ఏర్పాట్లపై విజయనగరం డీఎస్పీ గోవిందరావు, సీఐ చంద్రశేఖర్ నిర్వాహకులతో చర్చలు జరిపారు. ఈ జాతరకు సంబంధించి పెద్ద ఎత్తున తరలి వచ్చే భక్తులకు వసతితో పాటు ట్రాఫిక్ నియంత్రణపై చర్చించారు. పార్కింగ్ ఏర్పాట్లు పరిశీలించారు. కొండడాబా జాతరకు వెళ్లే వాహనాలు తిరిగి వచ్చేటపుడు తుమ్మికాపల్లి ఫ్లైఓవర్ మీదుగా వెళ్లేలా చూడాలని యోచిస్తున్నారు. జాతరకు ప్రత్యేక బస్సులను నడపనున్నారు.

10న ప్రజ్ఞా వికాస పరీక్ష

బెలగాం: పదో తరగతి విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి, భయాందోళనకు గురికాకుండా పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు ఈనెల 10న ప్రజ్ఞా వికాస పరీక్ష నిర్వహించనున్నట్టు ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ నాయకులు తెలిపారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో ఈ పరీక్షకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ నాయకులు కె.రాజు, టి.రమేష్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందిన వారికి రూ.5 వేలు, ద్వితీయ స్థానం పొందిన వారికి రూ.3 వేలు, తృతీయ స్థానం పొందిన విద్యార్థికి రూ.2 వేలు చొప్పున నగదు బహుమతులు ఇస్తామని తెలిపారు. ఈ పరీక్ష రాయాలనుకునే వారు ఈనెల 7లోగా రూ.25 చెల్లించి పేర్లు నమోదు చేసుకుని హాల్ టికెట్ తీసుకోవాలని తెలిపారు. వివరాలకు 94405 65436, 76719 94813 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

యువతకు మోసం



ఎస్.కోట మండలంలో పర్యటిస్తున్న గొంప కృష్ణ

శృంగవరపుకోట రూరల్: 'జగన్‌రెడ్డి నువ్వు యువతను ఉద్యోగాలు ఆశచూపించి మోసం చేశావు.. వారికి జరిగిన మోసానికి త్వరలో జరగనున్న ఎన్నికల్లో నిన్ను.. నీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపనున్నారు సిద్ధంగా ఉండు' అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో కలిసి బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

బొండపల్లి: ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరిగినా తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రమాదాల నుంచి సురక్షితంగా బయటపడే అవకాశం ఉందని అగ్ని మాపకశాఖ జిల్లా డీడీఆర్ఎఫ్ బీవీఎస్ రామ్‌ప్రకాష్ పేర్కొన్నారు. మండలంలోని కెరడాం గ్రామంలో బుధవారం సాయంత్రం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) గ్రామం మీదుగా ఏర్పాటుచేసిన పైపులైను వద్ద ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం ఐవోసీఎల్, అగ్నిమాపక శాఖ సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణా నుంచి ఒడిశాలోని పారాదీప్ వరకు కూడా మూడు రాష్ట్రాలు మీదుగా పైపులైను ద్వారా ఆయిల్ సరఫరా అవుతుందని చెప్పారు. గ్రామాలకు మీదుగా వెళ్తున్నప్పుడు మధ్యలో పైపులైన్లు వద్ద ప్రమాదవశాత్తు లీకులు ఏర్పడి ప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తం అయ్యి మంటలు వ్యాపిస్తే సమీపంలోని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే సమాచారాన్ని టోల్‌ఫ్రీ నెంబరు 18001252159కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఎఫ్ సోమేశ్వరరావు, తహసీల్దార్ డీజీఎంఎస్ ప్రసాదరావు, ఎస్ఐ కె.లక్ష్మణరావు, సహాయ అగ్నిమాపక అధికారి కేఎస్ సంతోష్, వైసీపీ జిల్లా కార్యదర్శి గొట్టిముక్కల శివరామరాజువర్మ, నాయకులు నెట్టి ముకుంద, ఐవోసీఎల్ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలోనే సమస్యలు పరిష్కరించాలి

గుర్ల: గ్రామ స్థాయి సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చి అదే స్థాయిలో పరిష్కరించుకోవాలని ఎంపీపీ పొట్నూరు ప్రమీల సూచించారు. బుధవారం గుర్ల ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సభకు ఎంపీపీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జరిగే పనులను చెప్పాలని, జరగని పనులను వాయిదా వేయడం మంచి పద్ధతి కాదని ఆమె అన్నారు. గ్రామ స్థాయిలో విద్యుత్, మంచి నీరు, సాగు నీరు విద్యుత్ స్తంభాలు, రేషన్‌కార్డు, చిన్న సమస్యలు, వీధి కాలువలు, రైతుల సమస్యలు పరిష్కరించే బాధ్యత గ్రామ స్థాయిలో ఉండే ప్రతి అధికారి తీసుకోవాలన్నారు. ఒకవేళ జరగకపోతే వాటిని జిల్లా స్థాయి అధికారులకు తమ ద్వారా తెలియజేయాలన్నారు. ఈ ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు చాలావరకు గైర్హాజరయ్యారు. కబుర్లు చెప్పుకుని మొబైల్ చూసుకుని కాలయాపన చేశార. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అప్పలనాయుడు, కేవీ సూర్యనారాయణరాజు, సన్యాసినాయుడు, బంగారునాయుడు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

నెల్లిమర్ల: జిల్లాలోని లక్కవరపుకోటలో ఇటీవల జరిగిన గ్యాస్ పేలుడు ప్రమాదంలో కుటుంబ సభ్యులతో పాటు సర్వం కోల్పోయి ఒంటరిగా మిగిలిన ఓ బాధిరాలి పట్ల నెల్లిమర్ల మండలం కొండవెలగాడకు చెందిన కేవీడీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు మానవత్వంతో వ్యవహరించి రూ.21వేలు సాయంగా అందజేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ ఫర్ ఎవర్ గ్రూప్ 2007 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు మరో రూ.10వేలు అందజేశారు. గజపతినగరంలో బుధవారం అక్కడి ఎంఈవో విమలమ్మ చేతులమీదుగా ఈ మొత్తాన్ని బాధితురాలికి అందజేసినట్టు కేవీడీ ఎంప్లాయీస్ ప్రతినిధులు తెలిపారు.

ఆడపిల్లలను గౌరవించాలి

గుర్ల: ప్రతిఒక్కరూ ఆడపిల్లలను గౌరవించాలని గరివిడి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఆరుద్ర అన్నారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల చట్టంపై బుధవారం గుర్లలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పొట్నూరు ప్రమీల పాల్గొని, మాట్లాడారు. గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి, ఆ కమిటీ ద్వారా ఆడపిల్లలను వేధించినవారికి శిక్షలు విధిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అప్పలనాయుడు, వైసీపీ నాయకులు కేవీ సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుపై వాగ్వాదం

● అర్ధాంతరంగా ముగిసిన నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

పాలకొండ: పాలకొండ నగర పంచాయతీ పరిధిలో డంపింగ్ యార్డు విషయంపై టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పట్టణంలోని ప్రధాన సమస్యగాఉన్న డంపింగ్‌యార్డు విషయంపై కౌన్సిల్ సమావేశంలో టీడీపీ సభ్యులు గంటా సంతోష్‌కుమార్, పడాల రాంబాబు ప్రశ్నించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు పట్టణంలోని సమస్యలు పట్టవా అని నిలదీశారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి అధ్యక్షతన బుధవారం జరిగిన కౌన్సిల్ నెలవారి సమావేశంలో 20వార్డు ప్రతినిధి గంటాసంతోష్‌కుమార్ మాట్లాడుతూ నగరపంచాయతీ స్థలాలు కబ్జాలకు గురవుతున్నట్లు ఇటీవల వరుసగా సోషల్ మీడియాలో వస్తున్నాయని, దీనిపై ఏంచర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలాలకు చుట్టూ కంచె వేసి బోర్డు పెట్టాలని కోరారు. దీంతో కమిషనర్ మాట్లాడుతూ నగర పంచాయతీకి స్థలాలు ఎక్కువగా లేవని, గారమ్మకాలనీ, లుంబూరు కాలనీ స్థలాలు రెవెన్యూకు సంబంధించినవని, వాటిపై నగర పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోలేదని తెలిపారు. దీంతో సంతోష్‌కుమార్ స్పందిస్తూ నగర పంచాయతీవి కానప్పుడు వాటికి రోడ్లు, నీటి సరఫరాకు ఎందుకు ఖర్చు చేస్తుందని ప్రశ్నించారు. డంపింగ్‌యార్డుపై సమాధానం చెప్పాలని కోరారు. ఈ విషయంపై వైసీపీ కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు, వెలమల మన్మథరావు తదితరులు మాట్లాడుతూ డంపింగ్‌యార్డు తరలింపు కోసం ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఈ సమయంలో వైసీపీ కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు, టీడీపీ సభ్యులు గంటా సంతోష్ కుమార్ మధ్య వాగ్వాదం జరిగింది.

ఆసరా చెక్కుల పంపిణీ

భోగాపురం: భోగాపురం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం వైసీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి అధ్యక్షతన 4వ విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొని, లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, పార్టీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

● గజపతినగరం: వైఎస్సార్ ఆసరా 4వ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం బుధవారం గజపతినగరంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పాల్గొని, లబ్ధిదారులకు రూ.8కోట్ల 6లక్షల విలువగల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘురాజు, ఎంపీపీ బెల్లన జ్ఞానదీపిక, జడ్పీటీసీ గార తవుడు పాల్గొన్నారు.

అజెండాపై చర్చించకుండానే ముగించారు

● మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



అధికారులను ప్రశ్నిస్తున్న టీడీపీ కౌన్సిలరు రాంబార్కి శరత్‌బాబు

బొబ్బిలి: బొబ్బిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు అధ్యక్షతన జరిగింది. కౌన్సిల్ సాధారణ, అత్యవసర, బడ్జెట్ సమావేశాలంటూ మూడు రకాల అజెండాలను సభ్యులకు పంపిణీ చేశారు. ఇందులోని అంశాలను పూర్తి స్థాయిలో చదవకుండా, చర్చించకుండానే సమావేశాన్ని ముగించేశారు. తొలుత ఏడో వార్డు కౌన్సిలర్ రాంబార్కి శరత్‌బాబు మాట్లాడుతూ బడ్జెట్ లెక్కల్లో గత ఏడాది ఖర్చులకు, ఈ ఏడాది ప్రతిపాదించిన వాటిలో వ్యత్యాసాలకు గల కారణాలేమిటని ప్రశ్నించారు. దీనిపై డీఈఈ కనకరాజు, మేనేజరు శివప్రసాద్, ఏఈ సురేష్‌లు వివరణ ఇచ్చారు. వైస్‌చైర్మన్ చెలికాని మురళీకృష్ణ, గెంబలి శ్రీనివాసరావు, బొత్స రమణమ్మ, వెలగాడ హైమావతి తదితరులు వార్డుల్లో సమస్యలను ప్రస్తావించారు. అవుట్‌సోర్సింగ్ విభాగంలో నాలుగు పోస్టులను భర్తీ చేసేందుకు కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ పోస్టుల విషయంలో అనేక ఆరోపణలు వెల్లువెత్తినప్పటికీ ఏ ఒక్కరూ నోరు మెదపకపోవడం గమనార్హం. అజెండాలు పూర్తయిన వెంటనే సమావేశం ముగిసినట్లు చైర్మన్ ప్రకటించారు. ఆయనతో పాటు అధికారులు, కౌన్సిలర్లు వడివడిగా బయటకు వెళ్లిపోయారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆసరా సమావేశం ఉన్నందున మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని త్వరగా ముగించినట్లు అధికారులు తెలిపారు.

ముగిసిన పరదేశమ్మ తీర్థ మహోత్సవం



దౌడు తీస్తున్న ఎడ్ల బండి

వేపాడ: వావిలపాడు పరదేశమ్మ తీర్థ మహోత్సవం బుధవారం ముగిసింది. రెండు రోజుల పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పరదేశమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా నిర్వహించిన ఎడ్ల బండ్ల పోటీలు ప్రజలను ఆకట్టుకున్నాయి. విజేతలకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, డీసీసీబీ చైర్మన్ వి.వి.చినరామునాయుడు బహుమతులు అందజేశారు.

పంట పొలాల్లో ఏనుగులు

● ఆందోళనలో రైతులు



మాదలంగి సమీపంలోని మొక్కజొన్న పొలాల్లో సంచరిస్తున్న ఏనుగులు

కొమరాడ, జనవరి 31: మండలంలో మాదలంగి, వన్నాం గ్రామాల మధ్య బుధవారం గజరాజులు సంచరించాయి. దీంతో ఆయా గ్రామస్థులు బెంబేలెత్తిపోయారు. ఇప్పటికే ఏనుగులు ఆయా ప్రాంతాల్లో మొక్కజొన్న పంటను నాశనం చేశాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. కొద్ది రోజులుగా వన్నాం, దళాయిపేట, మాదలంగి, పాలెం, తొడుము, తదితర ప్రాంతాల్లోని పంటల పొలాల్లో సంచరిస్తూ.. మొక్కజొన్న, అరటి, తదితర పంటలను ఏనుగులు ధ్వంసం చేస్తున్నాయి. దీంతో వేలాది రూపాయలు మదుపులు పెట్టిన రైతులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే ఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించాలని వారు కోరుతున్నారు.

ఆరోగ్య సర్వేలు చేపట్టండి

● జిల్లా మలేరియా అధికారి ఆదేశం ● రెబ్బ గ్రామం సందర్శన



రెబ్బలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న డీఎంవో

కొమరాడ: రెబ్బ, వనధార గ్రామాల్లో ఎప్పటికప్పుడు ఆరోగ్య సర్వేలు చేపట్టి.. నివేదికలు అందించాలని జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహనరావు ఆదేశించారు. 'జ్వరంతో చిన్నారి మృతి' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఈ మేరకు బుధవారం రెబ్బ గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్థుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. అక్కడ నిర్వహించిన వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. జ్వర లక్షణాలతో ఉన్న వారికి నిర్వహించిన రక్త పరీక్షలు, వాటి నివేదికలను పరిశీలించారు. వారికి తగు మందులు అందజేసి , రోజు పర్యవేక్షించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.అవసరమైన మందులు, పరీక్షలు గ్రామంలో అందుబాటులో ఉంచాలని సూచించారు. జ్వరాలను గుర్తించడంలో అలసత్వం వహిస్తే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. గిరిజనులతో మాట్లాడుతూ ఆరోగ్యపరంగా ఏ సమస్య వచ్చినా వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. తాగునీటిని కాచి చల్లార్చి తాగాలని సూచించారు. అనంతరం ఆయన దోమల ప్రభావిత ప్రదేశాలను పరిశీలించి వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట పారిశుధ్య పనులు చేయించాలని పంచాయతీ సెక్రటరీ, సూపర్‌వైజర్‌ను ఆదేశించారు. ఈ పరిశీలనలో డాక్టర్ బి.శామ్యూల్, ఏఎంవో సూర్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి ధనుంజయరావు, సీహెచ్‌వో బంగారుబాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో వైసీపీ విఫలం

రామభద్రపురం: రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని టీడీపీ బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీ నాయన ఆరోపించారు. కొట్టక్కి గ్రామంలో మంగళవారం రాత్రి జయహో బీసీ సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అట్టడుగు స్థానానికి వెళ్లడానికి కారణం జగన్మోహన్‌రెడ్డి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలేనని దుయ్యబట్టారు. ధాన్యం కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని ఆరోపించారు. మొక్కజొన్న, పత్తి పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు దళారులను నమ్మి నష్ట పోతున్నారన్నారు. 3 సంవత్సరాల నుంచి యువతకు ఉపాధి లేకపోవడంతో యువత ఉపాధిహామీ పథకం పనులకు కూడా వెళ్తున్న పరిస్థితులు ఈ ప్రభుత్వ హయాంలో దాపురించాయన్నారు. కొట్టక్కి గ్రామం టీడీపీకి కంచుకోటని, కొట్టక్కిలో సమస్యలు పరిష్కరించడానికి ఈ గ్రామాన్ని తాను దత్తత తీసుకుంటానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీసీ సాధికారిక సభ్యుడు కొల్లు అప్పలనాయుడు, టీడీపీ నాయకులు చింతల రామకృష్ణ, మడక తిరుపతినాయుడు, కర్రోతు తిరుపతిరావు, కరణం విజయభాస్కర్, ముల్లు రాంబాబు, వంగపండు అప్పలనాయుడు, అడపా అప్పలకొండ, గంట సాయికుమార్, కోట వెంకట నాయుడు, కూనిశెట్టి భాస్కరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీపురుపల్లి: గరివిడి విద్యుత్ సబ్ స్టేషన్‌లో సాంకేతిక పనుల నిర్వహణ కారణంగా చీపురుపల్లి మండలంలోని పీకే పాలవలస, గచ్చలవలస, గరివిడి మండలంలోని కోనూరు సబ్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ పూడి హరి ఒక ప్రకటనలో తెలిపారు. గరివిడి 220/33 కేవీ సబ్ స్టేషన్‌లో రణస్థలం- గరివిడి ఫీడరుకు సంబంధించి కొత్తగా బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

గురుకులంలో ప్రవేశానికి నోటిఫికేషన్

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్టలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల, పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్ సీఈసీ, ఎంఈసీలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజు తెలిపారు. బుధవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ గతనెల 25న ప్రారంభమైన ఈ ప్రక్రియ, ఈనెల 23 వరకు ఉంటుందని చెప్పారు. ఐదోతరగతికి సంబందించి 80 సీట్లకు గాను ఎస్సీలకు 70సీట్లు, ఎస్టీలకు ఐదు, బీసీలకు నాలుగు, ఓసీకి ఒక సీటు కేటాయించినట్లు తెలిపారు. ఇంటర్‌లో 80 సీట్లకు అడ్మిషన్లు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు నిర్దేశించిన వెబ్‌సైట్‌లో అర్హత ప్రామాణికంగా దరఖాస్తుచేయాలని కోరారు. ప్రవేశపరీక్ష ద్వారా ఎంపికచేయనున్నట్లు తెలిపారు.

సాగర సంగ్రామ దీక్ష విజయవంతం చేయాలి

వంగర: సీపీఎస్ రద్దుకోసం ఈనెల నాలుగో తేదీన విశాఖలో నిర్వహించనున్న సాగర సంగ్రామ దీక్ష మహాసభను విజయవంతం చేయాలని ఏపీసీపీఏ కార్యదర్శి పి.శ్రీకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం అర సాడ, శివ్వాం, వంగర, సీతారాంపురం పాఠ శాలల్లో పర్యటించారు. ఈ సందర్భంగా సంగ్రామ దీక్ష వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

శంబర మారు జాతర ఆదాయం రూ.25.59 లక్షలు



అమ్మవారి ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు

మక్కువ: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి శంబర పోలమాంబ మారు జాతర ఆదాయాన్ని దేవదాయ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ఆలయ ప్రాంగణంలో హుండీలను లెక్కించారు. కానుకలు, నగదును వేరు చేశారు. మొత్తంగా రెండో వారానికి సంబంధించి భక్తుల నుంచి రూ.25,59,843 వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.